క్లుప్తంగా

కంప్యూటర్ల వితరణ



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం స్థానిక మనోహర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏడు కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మనోహర్ మాట్లాడుతూ.. కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందిస్తామన్నారు.

సమయపాలన పాటించాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది సమపాలన పాటించాలని ఆర్మూర్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు అన్నారు. ఆస్పత్రిలో శనివారం బయోమెట్రిక్ విధానం ఏర్పా టు చేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. వైద్యాధికారులు, సిబ్బంది కచ్చితంగా బయోమెట్రిక్‌లో తమ హాజరును నమోదు చేసుకోవాలన్నారు.

అటవీ భూమి పరిశీలన

నవీపేట: మద్దెపల్లి శివారులోని అటవీ భూమిని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ శనివారం పరిశీలించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు పనులలో కొన్ని చోట్ల అటవీ భూమిని అప్పగించామన్నారు. 30 ఎకరాల అటవీ భూమి పోగా మద్దెపల్లి శివారులో తిరిగి 30 ఎకరాలను అటవీ శాఖాధికారులకు అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద స్థలం..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా రవాణ శాఖ అధికారి ఉమామహేశ్వర్‌రావు ఉన్నత అ ధికారుల ఆదేశాల మేరకు పరిశీలించారు. శాఖాపరమైన దర్యాప్తుతో పాటు ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఫిట్నెస్, టాక్స్, లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డిని సూచించారు. అనంతరం ఆర్మూర్ ఎంవీఐ కార్యాలయన్ని సందర్శించారు. స్థానిక సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు.

స్వీయ రక్షణకు శిక్షణ



బోధన్‌టౌన్(బోధన్): జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్, జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల సూచనలు, జిల్లా వైద్యాధికారి ఆదేశాల అనుసారం శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు, జీఎన్‌ఎంలకు స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తమను తాము రక్షించుకోవడానికి శిక్షణ ఇస్తున్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

అలరించిన కుస్తీ పోటీలు



బోధన్‌రూరల్(బోధన్): కల్దుర్కిలో శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని కుస్తీ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతకు నగదు బహుమతులను గ్రామపెద్దలు అందజేశారు. ఈ కుస్తీ పోటీలను తిలకించేందుకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

మాతృ, పితృ దినోత్సవం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్లో శనివారం మాతృ పితృ దినోత్సవం, పాద పూజ కార్యక్రమం నిర్వహించారు. పాజిటివ్ పేరెంట్ వర్క్ షాప్‌లో భాగంగా ముఖ్య అతిథిగా కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహా రాజు పాల్గొని పిల్లలకు తల్లిదండ్రులకు నైతిక విలువల గురించి వివరించారు. మోటివేషనల్ స్పీకర్ శ్రీహరి మాట్లాడుతూ.. పిల్లల పట్ల తల్లిదండ్రులతో ఎలా ఉండాలో చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ అరుణ్, ప్రిన్సిపాల్ రవికిరణ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ చర్యలను ఖండించండి

బోధన్: పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం, రుణమాఫీ అంశాలపై ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా పోరాటం చేస్తున్న రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఖండించాలని రైతు సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం, ఏఐకేఎంఎస్, సీఐటీయూ అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం వైఖరిని వ్యతిరేకిస్తు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాధర్ అప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దారి పొడవునా గుంతలే!

- నరకప్రాయంగా కోమట్‌పల్లి-నికాల్‌పూర్ బైపాస్ రోడ్డు
- కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడవడంతో జల్లెడలా మారిన వైనం
- కొత్త రోడ్డు వేయాలని కోరుతున్న ప్రజలు



అధ్వానంగా తయారైన కోమట్‌పల్లి-నికాల్‌పూర్ బైపాస్ రోడ్డు



డొంకేశ్వర్-నికాల్‌పూర్ బైపాస్ రోడ్డు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రాన్ని కలుపుతూ శాపూర్ నుంచి కోమట్‌పల్లి, నికాల్‌పూర్ గ్రామాల మీదుగా వేసిన బైపాస్ బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. దారి పొడవునా గుంతలు, కంకర తేలి నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డు గుండా వాహనాలు నడిపించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. ఆటో డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకుని ఇటువైపు రావాలంటేనే జంకుతున్నారు. పై మూడు గ్రామాలను కలుపుతూ అధికారులు ఎనిమిదేళ్ల క్రితం మండల కేంద్రానికి బీటీ రోడ్డును వేశారు. గోదావరికి అవతల గ్రామాల ప్రజలతో పాటు డొంకేశ్వర్ మండల వాసులు రాకపోకలు సాగించడానికి ఇదే రోడ్డును ఎక్కువగా వినియోగిస్తున్నారు. గుంతలు తేలినప్పటికీ మరమ్మతులు చేయకపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. ద్విచక్ర వాహనాలు కూడా నడపలేని పరిస్థితి నెలకొంది. గుంతలను తప్పించబోయి వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి కొత్త రోడ్డును వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నాయి. ఐతే, నాలేశ్వర్, తల్వేద, బాద్గుణ మీదుగా నికాల్‌పూర్ వరకు రోడ్డు వేసేందుకు రూ.8కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం కల్వర్టు పనులు జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ ఏఈ బాలాజీ 'సాక్షి'కి వివరణ ఇచ్చారు.

కేజ్ వీల్స్ ట్రాక్టర్లే కారణం..

శాపూర్, కోమట్‌పల్లి, నికాల్‌పూర్ వరకు ఉన్న బీటీ రోడ్డు అధ్వానంగా తయారవడానికి గల ముఖ్య కారణం రోడ్డుపై కేజ్ వీల్స్ ట్రాకర్లను తిప్పడమే. రైతులు వారి పొలాలను నాటే ముందు ట్రాక్టర్లకు ఇనుప చక్రాలు బిగించి రోడ్డుపై నడుపుతున్నారు. ఐదు కిలో మీటర్ల రోడ్డును పరిశీలిస్తే రోడ్డు మొత్తం జల్లెడలా మారింది. దీంతో రోడ్డు త్వరగా పాడై గుంతలు తేలాయి. అధికారులు, పోలీసులు హెచ్చరించినప్పటికీ రైతులు, ట్రాక్టర్ల యజమానులు పెడచెవిన పెడుతున్నారు. మళ్లీ కొత్త రోడ్డు వేయాలంటే రైతులు తమ పద్ధతిని మార్చుకుని కేజీ వీల్స్ తిప్పకుండా ఉండాలని అధికారులు పేర్కొంటున్నారు.

తాత్కాలిక మరమ్మతులు చేయాలి



మూడు గ్రామాల మీదుగా మండల కేంద్రానికి వెళ్లే బైపాస్ రోడ్డుపై ప్రయాణం చేయడం కష్టంగా ఉంది. గుంతలు, తేలిన కంకర కారణంగా వాహనాలు పాడవుతున్నాయి. కొత్త రోడ్డు వేసే వరకు అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి గుంతలను పూడ్చాలి. –సుమన్, కాంగ్రెస్ నేత, నికాల్‌పూర్

సమాజాభివృద్ధిపై కూడా దృష్టి సారించాలి



రక్తదాతలకు ప్రశంస పత్రాలను అందజేస్తున్న ప్రొఫెసర్ రవీందర్ రెడ్డి, సూర్య ప్రకాష్

బోధన్‌రూరల్(బోధన్): విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు సమాజాభివృద్ధిపై దృష్టి సారించాలని తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్స్ కో–ఆర్డినేటర్, ప్రొఫెసర్ కె. రవీందర్ రెడ్డి అన్నారు. మావందికుర్దులో ఉషోదయ డిగ్రీ కళాశాల వేసవికాలం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ ముగింపు సందర్భంగా శనివారం గ్రామంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవీందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు గ్రామీణ ప్రాంతాల స్థితిగతులు, గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరు, పాలన వ్యవహారాలు, సామాజిక బాధ్యత, సేవాభావంపై అవగాహన కల్పించేందుకు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లు నిర్వహిస్తారని అన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్నవారి కాపాడిన వారమవుతామన్నారు. ఉషోదయ విద్యా సంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుని తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తేవాలన్నారు. రక్తదాతలకు ప్రశంసపత్రాలను అందచేసి అభినందించారు. ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్ కో–ఆర్డినేటర్లు శ్రీకాంత్, ప్రశాంత్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచన



మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

రుద్రూర్: మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛంద సంస్థ అభయ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడారు. నెల రోజుల పాటు కొనసాగే శిక్షణను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. సీడీపీవో జానకమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మణి, మగ్గం వర్క్ ట్రెనర్ లిబియా, శిక్షణ కో–ఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పదేళ్లుగా పట్టిన శని వీడింది

- కాంగ్రెస్‌లో చేరిన కోటగిరి ఎంపీపీపై బీఆర్‌ఎస్ నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

రుద్రూర్: కోటగిరి ఎంపీపీ సునీతా శ్రీనివాసరావు కాంగ్రెస్‌లో చేరికతో తమ పదేళ్ల శని పోయినట్లయిందని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పదేళ్లలో శ్రీనివాస్‌రావ్ ఐదేళ్ల వైస్ ఎంపీపీగా, మరో నాలుగున్నరేళ్ల సునీత ఎంపీపీగా బీఆర్‌ఎస్ పుణ్యంతో గెలిచారని అన్నారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దయతో పదవులు అనుభవించి ఆయనతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా పార్టీ ఫిరాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గంగాధర్, విండో చైర్మన్ కూచి సిద్దు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతి కూలీకి పని కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయగౌడ్

వర్ని: ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలీకి పని కల్పించే విధంగా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా డీఆర్‌డీవో సాయగౌడ్ ఆదేశించారు. సోమవారం వర్ని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కూలీలకు పని కల్పించడంలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళిక తయారుచేసి పనులను గుర్తించాలని సూచించారు. నూతనంగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టిన వారిని గుర్తించాలని, వేసవికాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు తాగునీటి సౌకర్యం, టెంట్, వైద్య సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎంపీవో చందర్ నాయక్, అదనపు డీఆర్‌డీవో ఓంపాల్, సోషల్ ఆడిటర్ శ్రీనివాస్, ఈజీఎస్ అధికారులు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రత్యేక ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరిస్తాం



రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తున్న ఐఈఆర్పీలు

ఆర్మూర్: సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల(ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్) సమస్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఐఈఆర్పీలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న ఐఈఆర్పీలు హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి శనివారం తరలివెళ్లి తమ గోడును వెల్లబోసుకున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ నిర్వహించకపోవడంతో 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను కాదని నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని సీఎం ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు వివరించారు. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు వివరించారు.

కేంద్ర ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదు

పెర్కిట్(ఆర్మూర్): అన్నదాతలను కాల్చి చంపుతున్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు విమర్శించారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై పోలీసులు కాల్పులు జరపడం వల్ల శుభకరణ్ సింగ్ అనే రైతు మృతిచెందడాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు శనివారం బ్లాక్ డే పాటించారు. ఐఎఫ్‌టీయూ నాయకులు మామిడిపల్లి భగత్ సింగ్ చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. శుభకరణ్ సింగ్ కుటుంబాన్ని ఆదుకొని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఖాజా మొయినుద్దీన్, మదర్, మగ్దుం పటేల్, వర్షా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి



బాల్కొండ/పెర్కిట్(ఆర్మూర్): ముప్కాల్ మండలం కేంద్రంలో, ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లో శనివారం మోచి సంఘం ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ 647వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంత్ రవిదాస్ మోచి కుల వృత్తి నిర్వర్తిస్తూనే సనాతన ధర్మాన్ని బోధిస్తూ ఆచరించి చూపిన మహనీయుడని నేతలు కొనియాడారు. కౌన్సిలర్ లిక్కి శంకర్, రాచర్ల రాజేశ్వర్, రవి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

మల్లన్న సల్లంగా సూడన్నా..!





బాల్కొండ: మల్లన్న.. సల్లంగా సూడన్నా అంటూ బాల్కొండ మండల కేంద్రంలో, బోదేపల్లి, బస్సాపూర్, నాగాపూర్, ఇత్వార్‌పేట్ గ్రామాల్లో శనివారం మల్లన్నకు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.

■ **శివ శ్రీనివాసుని కల్యాణోత్సవం**

ముప్కాల్ మండల కేంద్రంలో దూల గుట్ట వద్ద శివ శ్రీనివాసుని కల్యాణోత్సవం నిర్వహించారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

■ **మల్లికార్జున స్వామి కల్యాణం..**

మెండోరా మండలం దూదిగాంలో మల్లికార్జున స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు.

■ **ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు..**

ముప్కాల్ మండలంలోని వెంచిర్యాల్‌లో శనివారం బంగారు వెంకన్న బ్రహ్మోత్సవాలు ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ **కనుల పండువగా రథోత్సవం**

ఎడపల్లి (బోధన్): జానకంపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం లక్ష్మీ నరసింహ రథోత్సవాన్ని భక్తులు కనుల పండువగా జరిపించారు. అనంతరం భజన పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం కుస్తీ పోటీలు పెద్ద ఎత్తున జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

■ **పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం**



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్టపై శనివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణోత్సవాన్ని తిలకించారు. సాయంత్రం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమ్‌గల్ సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

■ **లక్ష్మీనృసింహస్వామి ఆలయ వార్షికోత్సవం**



కమ్మర్‌పల్లి: కోనసముందర్‌లో శనివారం లక్ష్మీనరసింహస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. పలు పూజలు చేశారు. శాలివాహన సంఘం అధ్యక్షుడు పోతుగంటి లింగయ్య, సభ్యులు పోతువంటి శ్రీనివాస్, కానూరు మోహన్, పోతుగంటి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

■ **ఘనంగా ముజిగె మల్లన్న జాతర**



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో శనివారం వీడీసీ ఆధ్వర్యంలో ముజిగె మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల ప్రజలు స్వామిని దర్శించుకుని భక్తితో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం చుట్టూ రథోత్సవం నిర్వహించారు. అలాగే మంథని గ్రామంలో రంగ నాయక స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు.

అపురూప వేంకటేశ్వర ఆలయంలో..

మాక్లూర్: మండలంలోని అపురూప వెంకటేశ్వర ఆలయంలో శనివారం బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ట్రస్ట్ చైర్ పర్సన్ అమృతలత, రాజారెడ్డి, ప్రభ దేవి, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఆర్మూర్‌టౌన్: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ గజానాన్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఐ ఓట్ ఫర్ షూర్‌లో భాగంగా ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మామిడిపల్లి వరకు 2కే రన్‌ను మున్సిపల్, రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని, ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకుడ్ని ఎన్నుకోవచ్చని అన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజు, సీఐ రవికుమార్, ఎంఈవో రాజగంగారాం, సానిటరీ ఎస్సై మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉషోదయ జూనియర్, మహిళా జూనియర్ కళాశాలల వార్షికోత్సవం రవి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవాలను ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు దుష్యంత్, సునీత, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆనంద్‌రెడ్డి, ప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

పెర్కిట్(ఆర్మూర్): పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి అశోక్, వైద్య సిబ్బందికి సూచించారు. ఆర్మూర్ మండలం అందాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్‌ఈవో సాయి, హెల్త్ సూపర్‌వైజర్ అజీమా, ఆరోగ్య కార్యకర్తలు జక్కుల మోహన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	క్రాక్-జీతేగా తో జీయేగా (హిందీ) - 10.10, 3.40, 9.45 తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి (తెలుగు) - 1.30 సుందరం మాస్టర్ (తెలుగు) - 7.01
స్క్రీన్-2 –	భ్రమ యుగం (తెలుగు) - 12.00, 9.10 సిద్ధార్థరాయ్ (తెలుగు)-3.00 ఊరు పేరు భైరవ కోన(తెలుగు) - 6.10
స్క్రీన్-3 –	ఆర్టికల్-370 (హిందీ) - 1.00, 7.10, 10.35 సుందరం మాస్టర్ (తెలుగు) - 4.25
స్క్రీన్-4 –	ముఖ్యగమనిక (తెలుగు) - 1.05 మస్తు షేడ్స్ ఉన్నాయ్ రా - 1.50, హనుమాన్ (తెలుగు)-06.50 సుందరం మాస్టర్ (తెలుగు) - 10.10

సంక్షిప్తం

కార్మిక నాయకుడి ముందస్తు అరెస్ట్

బోధన్‌టౌన్(బోధన్): నిజాం చక్కెర కర్మాగారం పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన సబ్ కమిటీ బోధన్‌కు వచ్చిన సందర్భంగా సబ్ కమిటీ సభ్యులను కలవనీయకుండా కార్మిక నాయకుడు రవిశంకర్‌గౌడ్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయడం సరికాదని రవిశంకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

క్రికెట్, వాలీబాల్ టోర్నీ ప్రారంభం

నవీపేట: నాళేశ్వర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఈ పోటీలను ప్రారంభించారు. గెలుపొందిన విజేతలకు మాజీ సర్పంచ్ ద్యాగసరిన్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, బహుమతులను అందిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఎడపల్లి(బోధన్): మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభను జయప్రదం చేయాలని మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మిద్దె నరేందర్ మాట్లాడుతూ.. మార్చి 3, 4, 5 తేదీలలో ఖమ్మంలో మహాసభ 20 వేల మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు డి రాజేశ్వర్, గుమ్ముల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సంకర జాతి గేదెలకు టీకాలు

మాక్లూర్: ముల్లంగి(బి) గ్రామంలో శనివారం మండల పశు వైద్యాధికారి కిరణ్ దేశ్ పాండే ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది సంకరజాతి గేదెలకు టీకాలు వేశారు. పశు వైద్యాధికారి ఉమా సాహిర్, గంగ, జమున పాల్గొన్నారు.

విలేకరులపై దాడి అమానుష చర్య

రుద్రూర్: వార్త సేకరణకు వెళ్లిన విలేకరులపై కేజీబీవీ విద్యార్థుల తల్లిదండ్రులు కొంత మంది దాడి చేయడం అమానుషమని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు నడిపింటి కార్తీక్ అన్నారు. రుద్రూర్‌లో శనివారం ఆయన ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

రుద్రూర్: పొతంగల్ మండలంలోని కారేగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ పొతంగల్ మండల శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు సూదం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కిరణ్ బాబు తదితరులున్నారు.

మీ–సేవ నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్: హైదరాబాద్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును శనివారం నిజామాబాద్ జిల్లా మీ–సేవ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. మీ–సేవ కేంద్రం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ సభ్యులు కోరారు. నాయకులు షహిద్, మీరా శ్రవణ్, నరేష్, సోహైల్, హబీబ్ పాల్గొన్నారు.

ప్రధాని దిష్టిబొమ్మ దహనం

భీమ్‌గల్ : ఢిల్లీలో రైతులపై కాల్పులు జరపడాన్ని నిరసిస్తూ సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా ఆధ్వర్యంలో భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నేత రమేష్ మాట్లాడారు. కాల్పుల్లో చనిపోయిన, గాయపడిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.